నాలుగు వేలం హక్కులు ఒక్కరికే..

- ఫలించిన సిండికేట్ వ్యూహం
- మున్సిపాల్టీకి వేలంలో రూ.51.70 లక్షల ఆదాయం



వేలంపాటను నిర్వహిస్తున్న కమిషనర్ నయీమ్ అహ్మద్



లైటింగ్ సెక్షన్ ఆఫీసు వద్ద రాజీ ప్రయత్నాలు సాగిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: పట్టణంలో దినసరి పబ్లిక్ మార్కెట్, మాంసపు దుకాణాలు, పశు, గొర్రెలు, మేకల వధశాలల నుంచి సుంకం వసూలు చేసుకునే హక్కులను ఒకే వ్యక్తి దక్కించుకున్నారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ నయీమ్అహ్మద్ ఆధ్వర్యంలో కౌన్సిల్ హాల్‌లో బహిరంగ వేలం నిర్వహించారు. సుధాకర్ అనే వ్యక్తి దినసరి, వారపు సంత, రోడ్డు మార్గాల్లో వీధి విక్రయదారుల నుంచి సుంకం వసూలు హక్కును రూ.44.80 లక్షలు, మటన్ దుకాణాల నుంచి సుంకం వసూలు హక్కును రూ.3.05 లక్షలు, జంతు వధశాల(బీఫ్ అంగళ్లు) నుంచి సుంకం వసూలుకు రూ.1.85 లక్షలు, గొర్రెలు, మేకలు(జంతు వధశాల) నుంచి సుంకం వసూలు హక్కును రూ.2 లక్షలకు దక్కించుకున్నారు. వేలం ద్వారా మున్సిపాల్టీకి రూ.51.70 లక్షల ఆదాయం లభించింది. ఆర్ఐలు ఎర్రిస్వామి, సికె.రామాంజనేయులు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వంతపాడిన రెవెన్యూ సిబ్బంది

సుంకం వసూలు హక్కు వేలంపాటలో వేలంపాటదారుల సిండికేట్ వ్యూహం ఫలించింది. దీంతో మున్సిపాల్టీ ఆదాయానికి కొంత గండిపడింది. వేలంపాటదారులకు రెవెన్యూ సిబ్బంది కూడా వంతపాడారని పలువురు వేలంపాటదారులు బహిరంగంగానే ఆరోపించారు. అధికారపార్టీకి చెందిన పాటదారుల్లోనే తీవ్ర పోటీ ఉండటంతో మొదట రెండుసార్లు ఈ వేలాన్ని వాయిదావేశారు. బుధవారం కూడా ఉదయం 10:30 గంటలకు ప్రారంభం కావాల్సిన వేలాన్ని మధ్యాహ్నం 12 గంటలకు అధికారులు షురూ చేశారు. అప్పటికే పాత మున్సిపల్ ఆఫీసు కార్యాలయానికి చేరుకున్న పలువురు అధికారపార్టీ నేతలు లైటింగ్ సెక్షన్ ఆఫీసులో కూర్చొని పోటీదారుల మధ్య రాజీ కుదిర్చే ప్రయత్నం చేశారు. మాట వినని వారికి అధికార పార్టీ ముఖ్యనేతలతో ఫోన్‌లో మాట్లాడించారు. మున్సిపాల్టీ ఆదాయాన్ని పెంచేందుకు వీల్లేకుండా తమను వేలంపాట పాడొద్దని స్థానిక ఎమ్మెల్యే పేరు చెప్పి కొందరు అడ్డుతగులుతున్నారంటూ ధరావత్తు చెల్లించిన శివ అనే వ్యక్తి బంధువులు ఆరోపించారు. పక్కా ప్రణాళిక ప్రకారమే అధికారపార్టీ నేతలు చెప్పిన వ్యక్తికే అన్ని వేలాలు దక్కేందుకు రెవెన్యూ సిబ్బంది సహకరించారని పోటీదారులు ఆరోపించారు.

మున్సిపాల్టీ అభివృద్ధికి సహకరించండి

- కలెక్టర్‌ను కోరిన మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని



జిల్లా కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: గుంతకల్లు మున్సిపాల్టీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని కోరారు. బుధవారం ఆమె కలెక్టరేట్‌లో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాదిలింగేశ్వరబాబుతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రీ ఆడిట్ అధికారులు వేస్తున్న కొర్రీలతో పట్టణంలో అభివృద్ధి కుంటుపడుతోందని ఆమె తెలియజేశారు. పనులు చేసిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించని కారణంగా కొత్త పనులు చేసేందుకు వారు ముందుకు రావట్లేదని, సమస్యను పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ రిజర్వాయర్ మిగులు భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, జిల్లా సర్వేయర్ పర్యవేక్షణలో రీసర్వే చేయించి ఆ స్థలాన్ని పరిరక్షించేందుకు ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయించాలన్నారు. వేసవిలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి శివారుకాలనీల ప్రజల దాహార్తిని తీర్చేందుకుగానూ నిధులు కేటాయించాలన్నారు. పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని, పట్టణాభివృద్ధికి నిధులు విడుదల చేయించాలని ఆమె కోరారు. సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు ఆమె తెలియజేశారు.

విద్యుత్ సిబ్బంది తీరుతో ఇబ్బందులు



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

గుంతకల్లు: విద్యుత్ సిబ్బంది తీరుతో పట్టణ శివారులో నివాసముంటున్న పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ నాయకులు విమర్శించారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి, పట్టణ, రూరల్ కార్యదర్శులు గోపీనాథ్, రాము రాయల్ విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో నెల నెలా విద్యుత్ చార్జీలు చెల్లించకపోవడంతో లైన్‌మెన్లు విద్యుత్ కనెక్షన్‌ను కట్ చేయడంతోపాటు డిపాజిట్ చేసి బిగించుకున్న మీటర్లను తొలగిస్తున్నారన్నారు. అయితే విద్యుత్ చార్జీ చెల్లించిన తర్వాత కనెక్షన్ ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. దీనిపై విద్యుత్ డీఈని ప్రశ్నిస్తే మీటర్ ఒకసారి తొలగించిన తర్వాత తొలగిస్తే కొత్త మీటర్‌కు దరఖాస్తు చేసుకోవాలని చెబుతున్నారన్నారు. ఎక్కడా లేని విధంగా గుంతకల్లులో అధికారులు వినియోగదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, సమస్యను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సీపీఐ నాయకులు పుల్లయ్య, నూర్‌బాషా, గద్దం బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇచ్చిన హామీని నెరవేర్చాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

గుంతకల్లుటౌన్: రోడ్లపై గంపలు, తోపుడు బండ్లు పెట్టుకుని చిరువ్యాపారాలు చేసుకునే వారికి సుంకం వసూలు చేయకుండా కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే జయరామ్ ఇచ్చిన హామీని అమలు చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి నాగరాజు, డీవైఎఫ్ఐ కార్యదర్శి సురేంద్ర డిమాండ్ చేశారు. సుంకం వసూలు వేలంపాటను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో చిరువ్యాపారస్థులు మున్సిపల్ కమిషనర్ ఛాంబర్ ఎదుట ధర్నా నిర్వహించారు. సాక్ష్యాత్తు కౌన్సిల్ సమావేశంలోనే ఎమ్మెల్యే ఇచ్చిన హామీని అమలు చేయకపోతే ఎలా అని వారు కమిషనర్ నయీమ్‌ను నిలదీశారు. ఒకవేళ వేలం నిర్వహించినా పాటదారులు గెజిట్ ప్రకారమే సుంకం వసూలు చేయాలని, అధికంగా వసూలు చేస్తే ఆందోళనలు చేపడతామన్నారు. గెజిట్ ప్రకారమే సుంకం వసూలు చేసేలా ఆదేశాలిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. సీపీఎం నాయకులు రమేష్, నాగరాజు, శివన్న, చిరువ్యాపారులు పాల్గొన్నారు.

జంబులదిన్నె చెరువులో చేప పిల్లల విడుదల



జంబులదిన్నె చెరువులో చేప పిల్లలు విడుదల చేస్తున్న అధికారులు

గార్లదిన్నె: జంబులదిన్నె చెరువులో బుధవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా చేప పిల్లలు విడుదల చేసినట్లు పెనకచెర్ల డ్యాం మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఆసీఫ్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా జంబులదిన్నె చెరువు కమిటీ సమక్షంలో 12,000 చేప పిల్లలు విడుదల చేశామన్నారు. మత్స్యకారులు చేపలు పెంపకంతో ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఈఓఆర్డీ దామోదరమ్మ, చెరువు కమిటీ సభ్యుడు నాగప్ప, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద 36 వేల చేపపిల్లలను గుత్తి చెరువులో బుధవారం వదిలారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్, ఎండీఓ ప్రభాకర్ నాయక్, మత్స్యశాఖ అధికారులు, మత్స్యకారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా హిందీ పరీక్ష

శింగనమల: శింగనమలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల , కేజీబీవీలో జరుగుతున్న పదో తరగతి హిందీ పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈఓ నరసింహరాజు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 292 మంది విద్యార్థులకు గాను 291 మంది, కేజీబీవీలో 140 మంది విద్యార్థులకు గాను 139 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 131 మందికి 131 మంది హాజరైనట్లు వివరించారు.

పెద్దవడుగూరు: పెద్దవడుగూరులో బుధవారం హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జెడ్పీ పాఠశాలలో 216 మందికి 215 మంది, సరస్వతి హై స్కూల్‌లో 248 మంది విద్యార్థులకు గానూ 245 మంది పరీక్షలకు హాజరైనట్లు ఎంఈఓలు రాముడు, గురుప్రసాద్ తెలిపారు. యాడికిలోని మూడు కేంద్రాల్లో 713 మందికిగాను 8 మంది గైర్హాజరైనట్లు యాడికి ఎంఈఓ కాశెప్ప తెలిపారు.

గార్లదిన్నె: మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో బుధవారం టెన్త్ హిందీ పరీక్ష సజావుగా జరిగింది. గార్లదిన్నె, కల్లూరు జిల్లా పరిషత్ హైస్కూళ్లు, మోడల్ స్కూల్లో 610 మంది విద్యార్థులకు గాను 602 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న ఈఆర్ఓ మల్లికార్జునుడు

తాడిపత్రి: పోలింగ్ కేంద్రాల సంఖ్య పెంచాలని అఖిలపక్ష నాయకులు కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈఆర్ఓ మల్లికార్జునుడు అధ్యక్షతన అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, తహసీల్దార్ రజాక్‌వలి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు, యాడికి మండలాల తహసీల్దార్లతో పాటు ప్రజాప్రతినిధులు, టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, జనసేన నాయకులు హాజరయ్యారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఓటరు కార్డులకు ఆధార్ అనుసంధానం చేయాలన్నారు. ఓటరు లిస్ట్‌లో మార్పులు, చేర్పులు, తొలగింపులు నిబంధనల మేరకు చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రానికి కేవలం 1500 మంది ఓటర్లు మాత్రమే ఉండాలని, అందుకనుగుణంగా పోలింగ్ కేంద్రాలను పెంచాలని కోరారు.

పరిమితికి మించి కూలీలను తరలిస్తే వాహనం సీజ్



రోడ్డు ప్రమాదాలపై కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా

గార్లదిన్నె: పరిమితికి మించి కూలీలను తరలిస్తే వాహనం సీజ్ చేస్తామని ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా హెచ్చరించారు. బుధవారం మర్తాడులో పెద్ద సంఖ్యలో కూలీలతో వెళ్తున్న ఐచర్ వాహనాన్ని ఆపి వాహన డ్రైవర్‌తోపాటు కూలీలకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. డ్రైవర్లు మద్యం సేవించి, సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. వాహనాలకు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు.

సేంద్రియ ఎరువుల వాడకం లాభదాయకం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

బుక్కరాయసముద్రం: రైతులు సేంద్రియ ఎరువులు వాడకం ద్వారా తక్కువ ఖర్చుతో లాభాలు పొందవచ్చని ఆర్‌వైఎస్ ప్రోగ్రాం మేనేజర్లు డాక్టర్ నవీన్, డాక్టర్ నరేంద్ర పేర్కొన్నారు. బుధవారం రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ రైతులు సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేయడం లాభదాయకంగా ఉంటుందన్నారు. సేంద్రియ ఎరువులతో ఆహార పదార్థాలు ఆరోగ్యకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌వైఎస్ఎస్ ప్రోగ్రాం మేనేజర్లు రాజేశ్వరి, చిరంజీవి, రాజీవ్ గాంధీ, ఓబులపతి, పెద్దన్న, కేశవయ్య, గోపాల్, హరి ప్రసాద్, ఇవాంజెలి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడం తొలగింపు



డ్రైనేజీపై కట్టడాన్ని తొలగిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో డ్రైనేజీపై నిర్మించిన కట్టడాన్ని మున్సిపల్ అధికారులు బుధవారం తొలగించారు. ఇంటి యజమానికి నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో జేసీబీతో కట్టడాన్ని కూల్చివేశారు. అక్రమంగా నిర్మాణాలు చేస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా హెచ్చరించారు. మున్సిపల్ మేనేజర్ రాంబాబు, ఆర్ఐ షెక్షావలి, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ



సాయిరాజాను పరామర్శిస్తున్న ఏడీసీసీబీ మాజీ చైర్మన్ వీరాంజనేయులు

పామిడి: పట్టణంలోని నాగిరెడ్డి కాలనీకి చెందిన ఫోటోస్టూడియో యజమాని సాయిరాజా ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలిసిందే. బుధవారం అతడిని ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం.వీరాంజనేయులు పరామర్శించారు. అతడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, బెస్త వెంకట్రాముడు, ధను, రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోండి

గార్లదిన్నె: గార్లదిన్నె విశాలాంధ్ర విలేకరి కాశీవిశ్వనాథ్‌ను బెదిరిస్తున్న టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు బుధవారం తహసీల్దార్ ఈరమ్మ, ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషాకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి వన్నూర్ స్వామి, నాయకుడు శ్రీనాథ్ చౌదరి మాట్లాడుతూ కమలాపురం గ్రామంలో టీడీపీ నాయకులు అనుమతులు లేకుండా ఎర్రమట్టి తరలిస్తుంటే విశాలాంధ్ర విలేకరి సంబంధిత వీఆర్వోకు తెలియజేశారన్నారు. అలాగే ఇళ్ల నిర్మాణంపై గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను వివరాలు అడుగగా సిబ్బంది వివరాలు ఇవ్వకుండా టీడీపీ నాయకులకు సమాచారం ఇచ్చారన్నారు. గ్రామ టీడీపీ నాయకులు విలేకరి తండ్రికి ఫోన్ చేసి బెదిరించారన్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు, టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి అంజినమ్మ, జగన్నాథ, శివమ్మ, శీన తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని యాచకుడి మృతి

తాడిపత్రి: ఆటోనగర్ సమీపంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుక వైపు బుధవారం గుర్తు తెలియని యాచకుడి మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఘటనస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతి చెందిన వ్యక్తిని ఒక యాచకుడిగా గుర్తించారు. అతడు చనిపోయి మూడు నుంచి నాలుగు రోజులై ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. యాచకుడి మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని సీఐ కోరారు.

మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

గుత్తి రూరల్: అనంతపురంలోని రూడ్‌సెట్ కేంద్రంలో ఏప్రిల్ 4 నుంచి 30 రోజుల పాటు టైలరింగ్‌లో మహిళలకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 ఏళ్లమధ్య వయస్సున్న జిల్లాకు చెందిన మహిళలు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారని, వివరాలకు 9618876060 నంబరులో సంప్రదించాలని సూచించారు.

హరిహర క్షేత్రం నిర్మాణానికి సన్నాహాలు

అనంతపురం కల్చరల్: శింగనమల మండలం నాయనిపల్లి క్రాస్ సమీపంలో హరిహర క్షేత్రం నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి. బుధవారం అనంత ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు వివరాలు వెల్లడించారు. ప్రపంచంలోనే ఎత్తైన 300 అడుగుల మహాశివలింగం, 108 అడుగుల శ్రీమహావిష్ణువు విగ్రహం వీటి చుట్టూ అష్టాదశ శక్తిపీఠాలు నిర్మాణం కానున్నట్లు తెలిపారు. ఈనెల 21న ప్రపంచ ప్రసిద్ధి చెందిన స్థపతి (శిల్పులు)లు జిల్లా కేంద్రానికి విచ్చేస్తారని తెలిపారు. స్థానిక గీతామందిరంలో జరిగే సమావేశానికి అందరూ తరలి రావాలని ధర్మప్రచార మండలి అధ్యక్షుడు శ్రీపాద వేణు కోరారు. ప్రసాద్ స్థపతి, వాసు స్థపతి, దామోద స్థపతి తదితరులు అనంత ఆధ్యాత్మిక వేత్తలతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తారని తెలిపారు.

క్లుప్తంగా

బాధితులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



సాక్షి విలేకరి శ్రీనివాసులును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్: యాడికి మండలం చందన, లక్షుంపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పరామర్శించారు. లక్షుంపల్లిలోని వైఎస్సార్‌సీపీ నేత కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీదేవి, చందన గ్రామంలో సాక్షి విలేకరి శ్రీనివాసులు, ఎంపీటీసీ రాగుల పార్వతి ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య స్థితిపై ఆరా తీశారు. ధైర్యంగా ఉండాలని అన్నివిధాలుగా అండగా ఉంటానని వారికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యాడికి నాయకులు మాజీ జెడ్పీటీసీ వెంకటరామిరెడ్డి, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఉపేంద్రగౌడ్, నాయకులు తలారి నగేష్, శివయ్య, జగదీష్‌నాయుడు, చిన్నవెంకటరాముడు, శివశేషరెడ్డి, ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోక్సో యాక్ట్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి శ్వేత

గుత్తి: ప్రతి ఒక్కరికీ పోక్సో యాక్ట్‌పై అవగాహన అవసరమని గుత్తి జూనియర్ సివిల్ జడ్జి శ్వేత విద్యార్థినులకు సూచించారు. పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఇటీవల మహిళలు, బాలికలు, విద్యార్థినులపై దాడులు అధికమయ్యాయన్నారు. పోక్సో యాక్ట్‌తోపాటు బ్యాడ్, గుడ్ టచ్‌లపై పూర్తిగా అవగాహన పెంచుకోవాలన్నారు. కొత్త వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఎవరినీ గుడ్డిగా నమ్మొద్దని సూచించారు. న్యాయవాది గంగాధర్ కుమార్, సోషల్ వర్కర్ బాలాజీ, ఎస్ఓ దాక్షాయణి, కోర్టు సిబ్బంది సాదిక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీధిదీపాల ప్రారంభం

పుట్లూరు: నారాయణపల్లిలో బుధవారం ఓఎన్‌జీసీ అధికారి జగదీష్ పామర్తి వీధిదీపాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ ద్వారా 24 వాట్స్ సామర్థ్యం గల 50 ఎల్ఈడీ వీధి దీపాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రవిచంద్రారెడ్డి, మిత్ర హోలిస్టిక్ ప్రతినిధి లక్ష్మీరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాటుసారా తయారు చేస్తే కఠిన చర్యలు



నాటుసారా నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం సభ్యులు

శింగనమల: నాటుసారా తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలుంటాయని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య హెచ్చరించారు. బుధవారం నాగులగుడ్డం తండాలో నాటుసారా నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారాతో ఆరోగ్యం దెబ్బతినడంతోపాటు ఆర్థికంగా చితికిపోయి కుటుంబాలు రోడ్డు పాలవుతాయన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అనంతరం డప్పు కళాకారులతో నాటుసారా నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగసునీతారాణి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

33 కేవీ విద్యుత్‌లైన్ ఏర్పాటు చేయొద్దు



ఏఈకి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని సీఐటీయూ, ద్వారకానగర్‌ల మీదుగా 33 కేవీ హైటెన్షన్ విద్యుత్ తీగలను ఏర్పాటు చేయరాదని ట్రాన్స్‌కో రఘునాథ్‌ను సీపీఎం నాయకులు కోరారు. బుధవారం విద్యుత్ లైన్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆయా కాలనీలవాసులు ధర్నా నిర్వహించారు. విద్యుత్ లైన్లను ఏర్పాటు చేస్తే కాలనీవాసులను కలుపుకుని ఉద్యమాలు చేపడుతామని సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి హెచ్చరించారు. నాయకులు చంద్ర, రామునాయక్, అబ్దుల్లా, సూరి, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన దిలీప్‌రెడ్డి



మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన దిలీప్‌రెడ్డి

పామిడి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కలూరు దిలీప్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా జిల్లాలో పార్టీ స్థితిగతులపై చర్చించినట్లు దిలీప్‌రెడ్డి తెలిపారు.

త్రైత సిద్ధాంత క్యాలెండర్ల ఆవిష్కరణ



త్రైత సిద్ధాంత క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ

గుత్తి: ప్రబోధ సేవా సమితి ముద్రించిన త్రైత సిద్ధాంత (తెలుగు) క్యాలెండర్లను మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ ఆవిష్కరించారు. అలాగే మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, మండల పరిషత్ అధికారి ప్రభాకర్ నాయక్, ఎంఈఓ రవి నాయక్, తహసీల్దార్ ఓబులేసు కూడా వాటిని విడుదల చేశారు. ప్రబోధ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

పీ-4 సర్వేపై అవగాహన

గుత్తి: పట్టణంలోని పదో సచివాలయంలో బుధవారం మెప్మా ఆధ్వర్యంలో పీ-4 సర్వేపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మెప్మా అధికారులతో పాటు మహిళా సంఘాల సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ జబ్బార్‌మియా మాట్లాడుతూ పీ-4 సర్వే పూర్తి చేయించుకుంటేనే కేంద్ర, రాష్ట్ర పథకాల లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ నెలాఖరులోగా సర్వే పూర్తి చేయాలన్నారు. సీఎంఎం శ్రీనివాసరెడ్డి, కో-ఆర్డినేటర్లు చంద్రశేఖర్, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

కడప బస్సులకు ముచ్చుకోటలో స్టాపింగ్ పెట్టాలి

తాడిపత్రి రూరల్: కడప నుంచి అనంతపురం వెళ్లే బస్సులకు ముచ్చుకోటలో స్టాపింగ్ పెట్టాలని డీఎం శంకర్‌ను ముచ్చుకోట గ్రామస్తుడు జయరాముడు కోరారు. స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో పలువురు ప్రయాణికులు తమ అభిప్రాయాలను ఫోన్‌లో తెలిపారు. గుత్తి నుంచి తాడిపత్రికి రాత్రి సమయంలో చివరి బస్సు 8.30కి కాకుండా 9 గంటలకు ఉండేటట్లు చూడాలని రైల్వే ఉద్యోగి విజయ్ కోరారు. తాడిపత్రి నుంచి అనంతపురానికి పల్లె వెలుగు బస్సును నడపాలని తాడిపత్రికి చెందిన వెంకట్రాముడు తెలిపారు. ప్రయాణికుల అభిప్రాయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అనుమతులు తీసుకుంటామని డీఎం శంకర్ హామీ ఇచ్చారు.

దుకాణాల తనిఖీ



పామిడిలో ఆటో మొబైల్ షాపును తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ శంకర్

పామిడి: పట్టణంలో ఆటోమొబైల్ దుకాణాలను బుధవారం రాత్రి గుంతకల్లు తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ శంకర్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. షాపుల నిర్వాహకులు మెట్రాలజీ ప్యాకేజీ రూల్స్ పాటించకపోవడంపై కేసులు నమోదు చేశారు. ఆయా కంపెనీల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేయనున్నట్లు ఈసందర్భంగా ఆయన తెలిపారు.

వాహనాల వేలం

గార్లదిన్నె: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు పోలీసులు బహిరంగ వేలం నిర్వహించారు. మొత్తం 23 ద్విచక్రవాహనాలకు రూ.1,18,500 ఆదాయం సమకూరిందని ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు.